యర్రమిల్లి విజయలక్ష్మి



# సరస్వతీ నమస్తుభ్యం

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-
ఎ.ఐ.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో
సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

చిట, పట లాడుతున్న సర్విపుల్లల మంట ఎగదోసి-చట్టిలో గెంజి కలబెడుతున్న గౌరమ్మ-వీవు మీద వాలి మెడచుట్టూ చేతులు పెనవేసి అల్లిబిల్లి ఆడుతూ.. .'అమ్మా...' అని గునుస్తున్న కొడుకుని పక్కకి లాగుతూ..'అగ్గి కాడ సెతుర్లేందిరా ఎర్రెదవ...! వుండాడ...!' అని అదిలించింది.

కాస్త ఎడం జరిగినట్టే జరిగి మళ్లీ గౌరమ్మ ఒళో దూరి 'అమ్మ...నాను సదూకుంటానే...!" అనే సరికి గౌరమ్మ విస్తుపోయింది. కొడుకు మాట పట్టించు కోకుండా చట్టిలో కుత కుత లాడుతున్న గెంజి కలెడుతోంది. చంద్రం వదలకుండా అమ్మ కొంగు లాగుతూ" పంతులయ్య...సెప్పిండు కదమ్మా... బళ్లో కంపమని...నాను సదూ కుంతానే...।' చితుకుల మంట వెలుగులో వాడి చిన్న, చిన్న లొట్ట కళ్లలో మెరుస్తున్న ఆశ గౌరమ్మను కలవర పరిచింది.

'నిజవేఁ యా సంగి సెలవవై బల్లు తెరుత్తున్నారు...పిల్లగోళ్లని బడి కంపమని పంతుళ్లు గూడెవంతా తిరుగుతుండారు ఈడు పగులంతా ఆళ్ల ఎనకాకలే తిరిగి. తిరిగి వచ్చిండు...'

ఏట్రా... సదూంకుంతావా...? కుర్నాయాల...! సెతుర్లనుకుంతన్నావేట్రా సదూకోట మంతేని...! కూటికి లేనోళ్లం... మనికి సదూలేట్రా... ఎర్రెదవ... ఎర్రెదవాని..। గెంజి తాగి తొంగో... పా..." మెత్త మెత్తగా కూకలేస్తూ వేడేడి గెంజి సవెండి బొచ్చిలోకి వంచింది

చంద్రం కదల్లేదు. దానివంక కూడా చూడ్లేదు. మొరయించినట్టు అట్టే బుంగ మూతెట్టుకు నిలబడి పోయాడు.

...ఇగో.. అయ్యో... ఇంతన్నావా... ఈడి ఆగం...! గెంజి తాగడంట! ఎట్టనుంసున్నాడో సూద్రాదూ," అక్కడే ఒక పక్కగా కూర్చుని ఒక చేత్తో చిరిగిన వల బాగుచేసుకుంటూ - మరో చేత్తో కాలొచ్చి గున, గున అదీ ఇటు చిందు లేస్తున్న పెడ పిల్లని కట్టడి చేస్తున్నాడు పిచ్చయ్య. పెళ్లాం గెంజి పొంగిస్తున్నంత సేపూ పిల్ల పొయ్యి వైపు పోకుండా చూట్టం అతని బాధ్యత. తన పనిచేసుకుంటూ... ఓ చెవి అటే ఒగ్గేసే వుంచాడు. పిల్లాడి మారం చూస్తూనే వున్నాడు. పెళ్లాంఅల్లా అన్నాక కుదించుకుని.

పెద్దోళ్ల పిలగోళ్లక్కని... అయ్యన్ని మననుంటోళ్లకేట్రా... సేవలమ్మకుని బతికేటోళ్లం... మనకి సదువు. బడీ ఏట్రా అబ్బీ...! పొద్దోయింది. గెంజి తాగి తొంగో...!'

"గూడెం మద్దెల కొత్త బిల్డింగులు కట్టి బడెట్టింది గవర్నమెంటు. కలవలకి నీళ్లొదిన గాడ్నించి పంతులమ్మలు, పంతులయ్యలు, ఇజ్జాకలిటోళ్లు అదేపనిగా పూటాగూడి మరీ తిరుగుతుండారు. తెల్లారినకాడ్నించి సందేల వరకూ పుత్తుకాలు, కాగితాలు సంకనెత్తుకుని వంతులేసుకుని గుడిసి గుడిసి తిరుగుతుండారు. 'నీ మగడేం పని సేత్తడు...? నీ పెళ్లమేం సేత్తది... పిలగోళ్లెంతమంది? వయసెంత? పసోళ్లెంతమంది? బడికి పోయే వయసోళ్లెంతమంది? బడికి పోతుండారా ఆళ్లు? పోతే ఏ బడికి... ఇస్కూలుకా, కాని వెంటుకా? ఏ కళాసు... పోకుంటే ఎందుకు పోతంలా? పెబుత్తం... డబ్బులిచ్చుకోకుండా ఉద్దరంగా పిలగోళ్లందరికీ సదువు సెప్తంది. మద్దెటేల బళ్లో సదూకుండే పిల్లల కాడ్నే భోజనాలు కూడా ఎడతరు. అని పెచారం సేసుకుంటా పోతన్నారు. జనాభా లెక్కలోల్లనుకున్నా... కాదు... పిల్లల్ని బళ్లో సేర్పింసాల్నంట! ఈ కుర్రెదవల్లాలంట పొద్దూకులూ ఇనోదంగా తిరుగుతుండారు.. ఈడు సూడు... బడికెడతాడంట! మొరాయిత్తన్నాడు.' మగడికి బడిబాట గురించి చెప్తూనే గౌరమ్మ పొయ్యిలోంచి పుల్లలు బయటికి లాగి నీళ్లు చల్లి మంట ఆర్పింది.


-'నాకు తెల్దేటి! మళ్లీశు గుడిసెకాడికొచ్చిన్రుగా... అందరవాడ్నే వున్నం. ఇదే సంత! బడికి పోయి లచ్చనంగ అచ్చరాలు దిద్దుకోవాల్సిన పసోళ్లని మీరు పన్ల కంపుతున్నరు. ఆల్లు తెచ్చే అయిదు,పది డబ్బులకాశపడు తుండారు. సదువుకునే వయసులో పనికంపటం నేరం. సదివియ్యండి. పెబుత్వం మీ పిల్లల కోసం ఎన్నో సవుకరియాలు సేత్తంది. బిల్డింగుల కట్టిపిత్తాంది. పుత్తకాలు, పలకలు. బలపాలు ఇత్తాంది. మద్దేన్నం బోజనవెట్తాంది.

ఇంకేం గావాల... బిడ్డల్ని కూలి కంపమాకండి... బడి కంపండి.. ఆళ్ల కర్సు మీకేమీ వుండదు. తద్దెకంగా గవుర్నమెంటోరు సూసుకుంటారు 'అంటా అట్టుకున్నారు మల్లి గోడు మెత్తగందా'... ఊఁ ఆఁ' అంటా పత్తాయిత్తంటే వదలకుండగ అడ్నే కూకుని 'మీ కులపోల్లకి రిజర్వేసనీ కూడా వుండాలి... పై సదువులక్కాడ మీరేం పెట్టఖల్లేదు. సదువు కుంటే ఆళ్లకి ఏదో ఒక పనిదొరుకుద్ది. మీలా కట్టాలు బడకుండా సుకంగా బతుకుతారు. మీపిల్లోళ్ళు కూడా మీలాగా కష్టపడాలనుకోవటం అన్నాయంగదా. ఆల్లకన్నా సదువు సెప్పింసండ్రి' అంటున్నారు. అన్నాడు పిచ్చియ్య ఆరుబయల గోలెం కాడ కాలు. సెయ్యి కడుక్కుంట.

గౌరమ్మ నడుం మీద చెయ్యి ఊతమేసుకుని, పొయ్యిముందు నుంచి లేచింది బరువుగా. ఆమె ఏడు నెలల గర్భిణి. బక్క శరీరానికి బానంత కడుపు తప్ప ఏమీ కనిపించటంలేదు. 'ఎట్టుంది య్యాల?!' పెళ్ళాం అందించిన గెంజిగిన్నందుకుని అడిగాడు. గౌరమ్మ ఇనుకోకుండా పిల్లని ఒళ్ళో ఏసుకుని గెంజి తాపిస్తంటే 'దురగ పుట్టినప్పుడే ఆపరేసనీ సేపించుకోమంది డాట్టరమ్మ గోరు. రగతం తక్కువ్వుంది. బిడ్డను కనే సత్తువేలేదంది. మనవే ఇనుకోలా పెళ్ళాం వినేట్టు గొణిగాడు.

అల్లట్టాగే సెప్తారులేయ్యి.. ఆపరేసనీ సేపింసుకుంటే రెణ్ణెళ్ళన్నా మంచం మీనుండాలంట. నెకూడదంట. బరువెత్తకూడదంట.. వంగకూడ దంట.. అట్టెట్టాకుదురిద్ది.. మంచం మీన పద్దాక తొంగుంటె ఎట్టాగడుత్తాది. పన్లోకెళ్ళకుంటె కూడెట్ట.. ఈడే సూడు.. ఎట్టా మునగ దీసుకుండాడే.. ఇయ్యాల... గూడిపోళ్ళంతా పనొగ్గేసి అయ్యోరం సుట్టూ సేరేన్రు! పిలగాళ్ళని గవుర్నమెంటు బడి కంపితే కర్సులేకుండా సదువు సెప్తారంట. పగటేల బళ్ళంనే అన్నా వెడతారంట. 'గౌరమ్మ చెప్తూ ఆగంది అన్నాలంటుంటే నోరూరి గుటక మింగింది.

'మునుపు పిల్లోళ్ళకి తలా రెండు కిలోల బియ్యం నెలా కొలిచేవోరు. 'అయ్యోరూ... బియ్యమెప్పుడు కొలిపిత్తారో అడిగి రమ్మన్నది మాయమ్మ' అంటూ బియ్యం కొలిచే దానికి పదిరోజుల ముందు నుంచే పెద్ద, పెద్ద గోతావు సంచులుచ్చుకుని కూకునేవోరు. ఉత్త పుడు బడిముకం సూడకపోయినా —బియ్యాలు కొలిసే ఏలకి మాత్తరం పిల్లోల్లంతా సెల్లెళ్లనీ —తమ్ముళ్ళనీ ఎంటేసుకుని పొలో మంట పొయ్యేవోరు బళ్ళోకి. బియ్యాల కోసరవని. ఏ రోజూ ఆజరు కొట్టేఏలకి తప్పకుండా బడికెళ్ళేవోరు. నెలపొడవునా ఆజరు లేకపోతే బియ్యం కొలవరని బయ్యం. బియ్యాల కోసరంగాని... అచ్చరం ముక్కకోసవెట్టా ఆళ్ళు బడికి పొయ్యేది! ఎప్పుడెప్పుడు బియ్యం కొలుత్తారాని నెలపొడవూ ఆత్తరవే... ఇగ కొలిచే రోజు పండగే! తవ జనయ దరెద్రమంతా తీరిపోద్దన్నంత సంబరం. నానుబాలు, నాసిరకం, పుచ్చు, పురుగు, ముతక. ముక్కి ఒక్కోటూరి యాపారానికి పనికిరాని నిలవ సరుకంతా బియ్యం పదకం క్రింద బళ్ళకి పోసి వదుల్చుకునేవోరు యాపారులు! ఐతేం..! ఎట్టాటిదైనా కాని.. బియ్యం... బియ్యవేఁ. అన్నవన్నవే! ఆ పదకమాపేసిన్రు... అదున్నంతకాలం సిన్నా, సితకా బొడ్డూడని గుడ్డుని కూడా అంపేసేవోరు బడికి! మరి ఇద్దరెళ్లినా ముగ్గురెళ్లినా నెల నెలా తలా రెండు కేజీలు బియ్యమిచ్చేవోరు. ఎట్టాగో గెంజినీళ్ళ కెళ్ళమారి పొయ్యేది పిల్లల్ని బడి కంపటం తగ్గింది, సిన్నా సితకా పన్లో కంపితే పడ్డబ్బులు సంపాయిత్తన్నారు. తెల్లగుడ్డలేసి —నూనిపూసి తలదువ్వి —పలకా, బలపం ఇచ్చి బడికంపితే ఏటొచ్చుద్ది. బతకటానికింత ముద్దగావల గాని అచ్చరాలెందుకు... కూటికా గుడ్డకా.. పనికలవాటు పడితే రెండబ్బులు సంపాదింసుకుని ఇంత తినగల్డు.



పిచ్చియ్య మాటల్లో కనపడని వేదనవుంది పిల్లల్ని పనిలో పెట్టకండి బడికి పంపి చదువు చెప్పించండని ప్రభుత్వం ఊదరగొడుతోంది సిబ్బందిని గూడేలకు పంపి బడి ఈడు పిల్లలందర్నీ పాఠశాలల్లో భర్తీ చెయ్యటం వాళ్ళ అత్యవసర విధిగా నర్ణయించింది. ప్రాథమిక పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడి కింతమంది విద్యార్థులుంటేనే వాళ్ళ ఉద్యోగాలుంటాయని —లేకపోతే పోస్టులు తగ్గించేస్తామని పరుగులు తీయిస్తోంది ఒకమూల వీధికో ఇంగ్లీషు మీడియం కాన్వెంటుతో ప్రైవేటు విద్యావ్యాపారం ఆకర్షణీయంగా దిన దిన ప్రవర్ధమానమౌతోంది. అక్కడ ఫీజులు భరించగల ఆర్థిక స్తోమత ఏమాత్రం లేని నిరుపేదలు మాత్మరే తమ పిల్లల్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు పంపుతున్నారు. అసలు పిల్లల్ని బడికి పంపటం కంటె పనికి అలవాటుచేస్తే తిండికి గడుస్తుందని పిచ్చియ్య లాటివాళ్ళు ఆలోచిస్తున్నారు.

'ఈ పంతుళ్ళకి మరి పన్లేదులాగుంది... అప్పుడే వచ్చేసిన్రు'. గుంత మార్కెట్టుకి ఉప్పుచేపలెత్తుకెళ్ళే తొందరలో వున్నారు అక్కడివాళ్ళు. మాస్టర్లని అంతదూరం నుంచి చూస్తూనే చంద్రం, ఎంకన్న, చింపిరి కొందరు పిల్లలు అటు పరుగెట్టారు. వాళ్ళకి బడంటే ఆశ...

ఇద్దరిద్దరు టీచర్లు గూడెంలో ఇళ్ళు పంచుకుని సర్వే చేస్తున్నారు. వాళ్ళకి తెలుసు ఎండపడితే గూడెంలో పెద్దవాళ్ళెవరూ వుండరని! జాలరి గూడెంలో బడికి వెళ్ళే వయసు పిల్లలు బడికి రానివాళ్ళున్నారని వాళ్ళకు తెలుసు. ఎల్లాగోలా తల్లితండ్రుల్ని వప్పించి బళ్ళో చేర్పించటం వాళ్ళ తక్షణ కర్తవ్యం. పూర్వమంటే బడికి వచ్చిన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పటం ఉపాధ్యాయులుగా వాళ్ళవిధి. అయితే వేగంగా మారుతున్న కాలంలో వాళ్ళ విధులు కూడా తరగతి గదులకు పరిమితం కాక నానా విధాలుగా మార్పుకు లోనయ్యాయి. పిల్లలకు విద్యనేర్పటం సెకండరీగా మారింది. జనాభాలెక్కలు, కుటుంబనియంత్రణ సర్వేలు, చికెన్‌గున్యా, పోలియో, మలేరియా, ఫైలేరియా మందుల ఫంపిణీ వగైరా ప్రజాప్రయోజన కార్యక్రమాలు ఎన్నికల విధులు. ఇవన్నీ ఒకెత్తు కాగా.. ఇప్పుడీ పిల్లల్ని బళ్ళో భర్తీ చెయ్యటమనేది ఎన్నుకున్న ఉపాధ్యాయ వృత్తికే సవాలుగా బెదిరించే ప్రధాన విధైంది. ఎడ్యుకేట్ చెయ్యవలసింది పిల్లల్ని కాదు. తల్లిదండ్రుల్ని! వాళ్ళని బళ్ళో చేర్పటం. మధ్యలో జారిపోయే వాళ్ళని రెక్కుచ్చుకుని లాక్కొచ్చి క్లాసులో కూర్చోపెట్టడం —పిల్లలకు చదువులెంత ముఖ్యమో పెద్దలకు తెలియచేయటం. ఎప్పటికప్పుడు ప్రభుత్వం మారినప్పుడల్లా పేర్లు మార్చి కొద్దిపాటి మార్పు, చేర్పులతో తిరగరాయబడీ కొత్త కొత్త ఆకర్షణీయ పథకాలను ప్రచారం చేయటం వాళ్ళ ప్రధాన కర్తవ్యం.

సరే.. పంతుళ్ళంతా బడిబాట అని తాటికాయలంత అక్షరాలు రాసి వున్న మూడు రంగుల టోపీలు తలకు తగిలించుకుని విద్యా సంవత్సరం ఆరంభం కాబోతుండటంతో గూడాల్లో పడ్డారు ఫలానా సమయానికి ఫలానా కార్యక్రమం కొన్నిరోజుల పాటు విస్తృత ప్రచారంతో దేశమంతా ఉధృతంగా జరగాలన్నది ప్రభుత్వ నియమం. అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు కేటాయింపులు. తగిన ఆదేశాలు అందాయి. ప్రాథమిక విద్యాశాఖామాత్యులు జండా ఊపి కార్యక్రమాన్ని లాంఛనప్రాయంగా ఆరంభించి కొనసాగింపు ఛోటా, మోటా

స్థానిక నాయకులకు వదిలేశారు.

ఉప్పుచేపల గబ్బు —అడుగడుగునా గల గల నిండుగా పరవళ్ళు తొక్కుతున్న వైతరణీ పాయలు... ఝుమ్మున మేఘాలు కమ్మినట్టు ముసురుకుంటున్న దోమల గుంపులు. మురుగు వాసన ముక్కులు బద్దలు కొడుతుంటే రుమాలు గుడ్డ అడ్డం పెట్టుకుని నజాభా లెక్కల చిట్టాలు చూసుకుని పేర్లు వెతుక్కుంటూ గుడిసె. గుడిసె తిరుగుతున్నారు. పిల్లల్ని బడికి పంపిండి. దూరంలేదు. గూడెం మధ్యలో మీకందరికీ దగ్గరగా వుండాలని మంచి బిల్డింగు కట్టారు. ఏమీ ఇబ్బంది వుండదు. మంచిగా వెలుతురు ఆరోగ్యకరమైన వాతావరణం. ఇంగ్లీషు కూడా చెప్తాం.. బళ్ళు తెరుస్తున్నారు. 'ఇంటింటికీ అవే డైలాగులు.. సారాంశం ఒక్కటే..! చెప్పటం తమ ధర్మం. వినకపోతే వాళ్ళ కర్మం. వాళ్ళకేం కర్మ..! తమ ఉద్యోగాల కొస్తుంది అసలు కర్మ!

'మా పిలగాడు సదూకుంతే ఉజ్జోగవత్తుందెట్టా...' ఒక తల్లి అమాయకంగా గొణిగింది. 'పన్నేర్సుకుంటే పది రూపాయలు సంపాదించుకొత్తాడు గాని...'

'తగిన చదువులు చెప్పిస్తే ఉద్యోగాలెందుకు రావు. కష్టపడి చదువుకుని డిగ్రీలు సంపాదించి ఎంతమంది మంచి. మంచి ఉద్యోగాలు చేసుకోవటం లేదూ... అయినా చదువుకుంటే జ్ఞానం వస్తుంది. పిల్లలకి మంచీ, చెడూ తెలియాలి కదా...'

కుటుంబ భారాన్ని తగ్గించుకోవటానికి కాస్త వ్యక్తం తెలిసిన ఆడపిల్లల్ని, మగపిల్లల్ని ఏదో ఒక పనిలో పెట్టేస్తున్నారు. హాస్టల్ వసతి వున్నచోట తిండి, బట్ట, చదువు అన్నీ ఉచితమేకాక పిల్లల బాధ్యత మొత్తం వాళ్ళదే కనుక ఆ అర్హత వున్నవాళ్ళు కొందరు అక్కడ చేరుస్తున్నారు. చావో —రేవో ఏమైనా పిల్లలకి మంచి చదువులు చెప్పించాలన్న కోరికతో. తినీ —తినక ఇంగ్లీషు . కాన్వెంట్స్‌లోనే చేరుస్తున్నారు కొందరు. ఎందుకూ కొరగాని బళ్ళైపోయాయి ప్రభుత్వ పాఠశాలలు. 6 నుండి 10 సంవత్సరాల లోపు వయసున్న గూడెం పిల్లలు కొందరు నమోదు కావటంలేదు. బతిమాలో బంగపడో ఎల్లాగో చేర్పించినా కొందరు పదేసి రోజులు చెల్లల్లో పనికి పోతారు టీచర్ల కగపడకుండా అమ్మెనకో, అయ్యెనకో దాక్కుంటారు. తల్లినడిగితే తండ్రి పనిలోకి పిలుచుకు పోయాడంటుంది. తండ్రి నడిగితే తల్లితో పనికి పోయాడంటాడు పిల్లాడు మాత్రం గైర్హాజరై పోతుంటాడు.

'ఈల్లు బడికి పోకుంటే పంతుళ్ళకి జీతాలియ్యరంట... అందుకని పిల్లల కోసరం మన సుట్టూ తిరగతుండారు. అట్టాగని పద్దాక పలకా బలపం ఇచ్చి బళ్ళో కూకోపెట్టే పనెప్పుడొత్తది..' అని జాలిపడతారు. ఉద్యోగ భద్రత హాజరుపట్టీమీద ఆధారపడి ఉందని వాళ్ళకీ తెలిసిపోయింది.

'రేపటేల్నుంసి అంపుతాంలే సారూ'...! అన్నాడొక తండ్రి ముఖమాటానికి అది వట్టిదేనని తెలుసు. 'పిల్లలు గొడ్లకాడికి పోతండారు. సిన్న. సితక కూలిపన్లకి పోతండారు. బేల్దార పన్లకి —మేస్త్రీల సేతి కిందికి పోతుండారు. ఒటేళ్ళలో గిన్నెలు పావుతుండారు. అగ్గిపెట్టెల తయారీకి —అగరొత్తుల తయారీకి ఎండ్రుకల ఫాక్టరీకి ఎల్లి సీతనైన పనిసీసుకుని ఇంతగెంజి తాగతుండారు. ఉన్నోళ్ళగ్గాని మాకేటి సదువులయ్యోరు' సింహాచెలం అందుకున్నాడు.

రెక్కల కష్టం పట్ల విశ్వాసం —భవిష్యత్ మాటెల్లావున్నా అప్పటి కప్పుడు పది. పాతిక సంపాదించుకొస్తున్నాడన్న తృప్తి —అరకొర చదువులు చదివినా ఉపయోగం ఉండదన్న అపనమ్మకం — డబ్బులు పోసి మంచి చదువులు చెప్పించలేని నిస్సహాయత... ఇవన్నీ కలిసి పిల్లల చదువులపట్ల వాళ్ళకి శ్రద్ధ. అవగాహన లేకుండా చేస్తున్నాయి.

'సరే ... మీరు కాయకష్టం చేసుకుని బతుకుతున్నారు. మీ పిల్లలు కూడా మీలాగే బతకాలనుకుంటున్నారా..? అది అన్యాయం కదా! వాళ్ళు మీకన్నా సుఖంగా బతకాలని అనుకోరా మీరు... అది తప్పుకాదా... వాళ్ళ భవిష్యత్...'

''కట్టం సేసుకుని బతకటం తప్పేటమ్మా.. మా బతుకులింతే తల్లీ! కూలోడి బిడ్డ కూలోడు కాక డాట్టరో.. కలకటేరో అవుతాడెట్టా!

'అల్లా అనుకోవటం తప్పు. పిల్లల కోసం మనమిప్పుడు కష్టపడితే... రేపు వాళ్ళు పెరిగి పెద్దవారై మంచి ఉద్యోగాల్లో స్థిరపడతారు. అప్పుడు తెలుస్తుంది మీ కష్టానికి ఫలితం.

'అందాక గడవాలి గదయ్యా.. పదేనళ్ళమాట..'

'అదేవిటయ్యా... మీరు పిల్లల్ని పోషించాలా... వాళ్ళు మిమ్మల్ని పోషించాలా.. నువ్వు, నీ భార్య ఇద్దరూ కష్టపడి పిల్లల్ని చదివించండి. వాళ్ళ చదువుల ఖర్చు మీకేం వుండదు కదా. ఆనక ఉద్యోగాలు చేసి వాళ్ళే మిమ్మల్ని పోషిస్తారు. సుఖపెడతారు. చదువుకుంటే పిల్లలందరూ డాక్టర్లు, కలెక్టర్లూ కాకపోయినా కూలీలు మాత్రం కారు పైగా పిల్లలచేత పనిచేయిస్తే ప్రభుత్వం శిక్షిస్తుంది కూడా!'

ఇంచుమించు గూడెంలో మగవాళ్ళ సంపాదనంతా కల్లు దుకాణాలకే చెల్లు. ఆడవాళ్ళు, పిల్లల కూలిడబ్బుల్తో కుటుంబావసరాలు గడవాలి. అదేమని ప్రశ్నించే హక్కు ఎవరికుంది? గవర్నమెంటు దమ్ముండగా. ఒక పక్క తండ్రుల బలహీనతని సొమ్ము చేసుకుని రెవెన్యూ పెంచుకుంటూ. మరో పక్క వాళ్ళ పిల్లల్ని విద్యావంతుల్ని చెయ్యాలని..! ఊబిలాటి నిత్య దారిద్ర్యంలో కుత్తుకుల లంటి కూరుకుపోతున్నా కారణం పట్టదు. దారిద్ర్య నిర్మూలన ఏ ప్రభుత్వానికీ సాధ్యం... తాత్కాలిక ఉపశమన పథకాల ఎర తప్ప. అయితే ఈ మీమాంస వాళ్ళ కనవసరం. ఇల్లా మాట్లాడరాదు. ప్రభుత్వోద్యోగాలు —వాళ్ళ ధర్మంవేరు.




'వాళ్ళ చదువుల కోసం మీరు పదిపైసలు ఖర్చు పెట్టఖర్లేదు. కూర సాంబారు, గుడ్డు, మంచి పౌష్టికాహారం రోజూ మధ్యాహ్నం ఇస్తారు. ఇళ్ళలో కూడా మనం పిల్లలకంటే మంచి భోజనం పెట్టలేం. మీరు అంటే వాళ్ళు కోపగించుకోవచ్చు.. హాయిగా తిని నాలుగక్షరంముక్కలు వంటపట్టించుకుంటారు... మళ్ళీ మళ్ళీ విడమర్చి చెప్పారు.

మేధావులు, విద్యావేత్తలు, నాయకులు అందరూ కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో ఏటికేడు కనిష్టస్థాయికి పడిపోతున్న విద్యార్థుల సంఖ్యని నిలబెట్టడంకోసం తిరుగులేని మధ్యాహ్న భోజన పథకం అమలులోకి తెచ్చారు. కడుపుకాలే పేద ప్రజలు తిండికిచ్చే ప్రాధాన్యత దేనికీ ఇవ్వరు. ఏ రోజు ఆకలి ఆ రోజుదే. ఎవరి ఆకలి వారిదే. ఈ సూత్రాన్ని పట్టి —దేశంలోని ప్రాథమిక పాఠశాలలన్నింటిలోనూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు ఖర్చు కేంద్ర ప్రభుత్వం కొంత రాష్ట్ర ప్రభుత్వం కొంత భరిస్తుంది. విద్యార్థికి తలకొక 2 —3 రూపాయల భోజన నిమిత్తం ఖర్చు చెయ్యాలని నిర్ణయమైంది. బియ్యం సరఫరా ప్రభుత్వానిదే. పప్పు, కూర, సాంబారు. వారానికో రోజు గుడ్డు.. ఏదేది ఎంతంత వుండాలి. దేనికెంతెంత కేటాయించాలి. తూకాలు, లెఖలు నిర్ణయించబడ్డాయి. సర్పంచులు, స్థానిక విద్యాసంఘాల పర్యవేక్షణలో డ్వాక్రా మహిళా బృందాలకు వండి, వడ్డించే బాధ్యత అప్పగించబడింది. ఇదేదో అందరికీ బాగానే వున్నట్లుంది. నెలకిన్ని బియ్యం కొలవటం కంటె —పిల్లల ఆకలికి రోజూ ఒకపూట ఇంత భోజనం పెట్టడం వాళ్ళకీ ఆకర్షణీయంగానే ఉంది. హాజరు కొట్టే టైంకి బళ్ళో కొచ్చే పిల్లల సంఖ్య పెరిగింది. వాళ్ళేం నేర్చుకుంటున్నారన్నది కాదు. పస్తుల పొట్టలకి వేళకింత అన్నం దొరుకుతోందన్నది ముఖ్యం. వాళ్ళకేం వస్తోందన్నది కాదు. సర్వవిద్యా అభియాన్

క్రింద ఎంత సంఖ్యలో బడి ఈడు పిల్లలు హాజరవుతున్నారన్నది వీళ్ళకి ప్రధానం ప్రపంచ బ్యాంక్ షరతుల మేరకు 6–10 సంవత్సరాల బడికి వెళ్ళే ఈడుగల పిల్లలందరూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నమోదు కావాలన్నది. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అయితే విద్యావ్యవస్థ ఒక కీలకమైన అత్యంత లాభసాటి వ్యాపారరంగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో 'అ' అంటే అమ్మ 'ఆ' అంటే ఆవు అనే కాలం చెల్లిన చదువు నేర్పే పాఠశాలల గడపతొక్కేది తమ పిల్లలకు వేలాది రూపాయలు వెచ్చించి చదువులు కొనివ్వలేని నిరుపేదలు మాత్రమే! దేశంలో పేదరికం వర్ధిల్లుతున్నంత వరకు ప్రభుత్వ విధానాలకు ఎంతో కొంత తప్పనిసరి మద్దతు ఆయా వర్గాల నుంచి వస్తూనే ఉంటుంది.

వాడి పట్టుదలలో పంతుళ్ళ కృపో మొత్తానికి చెంద్రం బళ్ళో చేరాడు. అల్లాటి మరికొందరు పిల్లలు కూడా చెంద్రం తెలివైనవాడు. చురుకైనవాడు. ఇలా చెప్పండి అల్లా పట్టేస్తాడు. వాడేదో చదివి ఉద్ధరించేస్తాడని కాదు. ఒక్క పూటన్నా కడుపునిండా తింటాడని. హాజరేయించుకుని కడుపు నెప్పనో కాలు నెప్పనో ఏదో వంకన తప్పించుకుపోతారు. అన్నాల గంటకి ఎక్కడివాళ్ళు పరుగెత్తుకొస్తారు. బళ్ళోనే వరన్నం మెతుకు లేని గంజినీళ్ళే ఇంట్లో.

పదిగంటలైంది కాసేపు చూసి టీచర్ హాజరు పట్టీ మూసేసింది. రావలసింది నలభైమంది. ముప్పైమందే వచ్చారు. మిగతా పదిమంది చేలల్లో శెనక్కాయ పీకుడుకి పోయివుంటారు. సీజను..! ఒక అయిదుమందికి పెచ్చు చెప్పి వంటకు పురమాయించాడు హెడ్మాస్టర్ మహిళా సంఘం వాళ్ళు పొరుగునే వండి వార్చి వడ్డనకు సిద్ధం చేశారు. పన్నెండయ్యాక భోజనం గంటకొట్టారు పిల్లలంతా బిల బిల పళ్ళాలు తెచ్చుకుని బారున కూర్చున్నారు గసపోసుకుంటూ చెల్లిని చంకనేసుకుని పరుగున వచ్చాడు చెంద్రం. పళ్ళెం తెచ్చుకుని వరసలో కూర్చున్నాడు. పొద్దున్న గైరాజరైన పదిమందీ వేళకు హాజరైపోయారు.



'పొద్దుటేల బడికి రానోళ్ళకు భోజనం లేదు.'

పిల్లలు ఆకలితో వున్నారు. సంకటి ముద్ద, చింతపండు నీళ్ళ సాంబారు, చిటికెడు ఏదో కూర వాళ్ళకు నోరూరిస్తోంది వేడి, వేడి అన్నం వాసన ఆశగా పీల్చుకుంటున్నారు.

'అల్లరి చెయ్యకుండా తినాలి. అన్నం కింద పడకూడదు. 'టీచర్ అలంకార ప్రాయంగా చిన్న బెత్తం చేతిలో ఊపుకుంటూ పర్యవేక్షిస్తోంది.

'బడికి వచ్చిన వాళ్ళకే అన్నం.. మీరంతా లేవండి. పోయి ఇంట్లో తినండి. ఇదేదో ధర్మసత్రవని... చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ కూడా తీసుకొస్తారు...'

'ఇంటో వన్నం లేదు. బల్లో ఎడ్తారంది మాయమ్మ...' పళ్ళాలు ముందు పెట్టుకుని కదలకుండా కూర్చున్నారు కమ్మని వేడి సెగలు నోరూరిస్తున్నాయి.

'పోనీ పాపం.. కాస్త వాళ్ళకీ పెట్టు రత్నం...' టీచర్ వుండపట్టలేక గొణిగింది. గట్టిగా 'పెట్టు' అనటానికి భయం. అట్నించి వచ్చే సమాధానం తెలుసు. 'ముప్పైమందికి వండాల... అందరికీ ఎల్లా చాలుతుంది... నలభైమంది కూర్చున్నారు...'

'అందుకే అయిదుగురికి ఎక్స్ట్రా వేసాం కదా..' అప్రయత్నంగా అంది టీచర్. ర్నం అందుకుంది. 'అప్పుల ఊసు దేవుడెరుగు. మా నెత్తిన ఈ భోజనం బెడద తెచ్చి పెట్టారు. ఇంకెవరూ దొరకలా.. గాసివ్వరు. కట్టెలివ్వరు. కూర, సాంబారు, గుడ్డు అన్నీ పెట్టాల. ఎడ్నుంచి తవల. ఇచ్చేది రెండ్రూపాయలు. ముప్పైమందికి చెప్పి. ఏభై మందికి పెట్టమంటారు! ఇంతమందికి వండి, వార్చి మేం తినాల్నా.. వద్దా.. మా పిల్లలు మాడాల్నా... లేకుంటే ఆళ్ళకి మళ్ళీ వంటసెయ్యాల్నా ఇంట్లో, దండగ మారి సాకెరీ.. ఛస్తన్నాం.''

టీచర్ మాట పడిపోయింది. పట్టించుకోనట్టు వుండిపోయింది. ముందే కొంత అన్నం కూర, సాంబారు వేరే వుంచేసింది రత్నం. అది మామూలే. వాళ్ళ కుటుంబానికి! చంద్రం దాన్నిచూశాడు వాదులాడకుండా చల్లగా పళ్ళెం తీసుకుపోయి. గుప్పెళ్ళతో ఇంత అన్నం, కూర సాంబారు వంపుతున్న –చెల్లిని చంకనేసుకుని బయటకు లగెత్తాడు. తన కష్టాలు ఏకరువు పెట్టుకుంటూ పిల్లలకు వడ్డిస్తున్న రత్నం గమనించ లేదు పళ్ళాల్లో పడిన నాలుగు పిడచల సాంబారన్నం ఆవురావురని ఆబగా జుర్రుకుంటున్న పిల్లలూ చూళ్ళా. బెత్తం పుచ్చుకుని చిన్నపోయిన మనసుతో ఊరికే వాళ్ళమధ్య తిరుగుతున్న టీచరమ్మ చూసింది. 'ఆఁ' అనబోయి ఆగిపోయింది. 'ఇప్పుడు కాదు. ఇప్పుడు పట్టుకుని వాడ్ని అన్నం దొంగని చెయ్యకూడదు రేపు ఒక్కడ్నే కూర్చోపెట్టి చేసింది తప్పని చెప్పాలి. కేవలం అన్నానికి కాకుండా. చదువుకోవటానికి బడికి నియమంగా రోజూ రావాలని చెప్పాలి. చంద్రం బుద్ధిమంతుడు. తెలివైనవాడు. ఆకలిగా వుండి ఆ పనిచేసి వుంటాడు.' అనుకుంది.

కానీ చంద్రం మరునాడే కాదు డ్రాపౌట్ అయ్యాడు. మళ్ళీ ఎప్పుడూ బడికి రాలేదు. బడికి వెళ్ళి చదువుకోవాలన్న ఆశ ఏ చేదు వాస్తవమో తీర్చేసి నట్టుంది. ఒకసారి టీచర్ ఎల్లాగో వాడ్ని పట్టుకుని 'ఏరా.. చంద్రం.. బళ్ళోకి రావటం లేదేం..' అంది ఆ టీచరంటే వాడికి చాలా భక్తి, గౌరవం నిటారుగా నిలబడి రెండు చేతులు గుండెలకు కట్టుకుని 'బళ్ళో కొత్తే నాకొక్కడికే వన్న వెడతన్నారు టీచర్..! నేను పన్లోకెలితే నేనూ, మాసెల్లీ, అమ్మ, అయ్య అందరం అన్నం తింటన్నాం టీచర్.. పన్లోకెల్తన్నాను టీచర్. అన్నాడు అమాయకంగా, నిజాయితీగా వాడి పసిమాటలు గుండెల్లో గుచ్చుకున్నట్లై టీచర్ కళ్ళలో నీరు నిలిచింది 'వీడు బళ్ళో చేరతానని అలిగి, ఆగంచేసి తమని వప్పించాడని చెప్పింది వాళ్ళ అమ్మ. వాడూ ఎంతో ఇష్టంగా శ్రద్ధగా వచ్చేవాడు బడికి. మరి...'

'చదువా... వీళ్ళకి కావాల్సింది.. అన్నం కావలి కాని! ఆకలి... ఆకలి అది తీర్చేది పని.! కావల్సింది అక్షరం కాదు రెండు పూటలా వేళకింత అన్నమేనన్నది ఎవరైనా వప్పుకు తీరాల్సిన కఠిన వాస్తవం. తల్లి తండ్రుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడకుండా పిల్లలు పని ఎల్లా మానగలరు. పిల్లలే తమకు అదనపు వనరులుగా భావిస్తున్నారు తల్లిదండ్రులు. ఈ పరిస్థితుల్లో వాళ్ళు చదువుకోవటం సాధ్యమా. ఏ తల్లి తండ్రులైనా తమ సంతానం తమకన్నా ఉన్నతంగా ఉండాలనే కోరుకుంటారు. ఆర్థిక స్థితిగతులు బాగుంటే పిల్లల్ని చదివించటానికెవ్వరూ వెనుకాడరు. నిజంగా అందరికీ అక్షరాస్యతా లక్ష్యాన్ని సాధించాలంటే అనుకూల వాతావరణం కల్పించాలి. అది ప్రభుత్వ బాధ్యత పేదరిక నిర్మూలన ఒక్కటే దీనికి పరిష్కారం. అది జరగనంత కాలం చిత్తశుద్ధిలేని పథకాలు ఎన్ని రూపొందించినా ఫలితం శూన్యం! అయితే ఒక సామాన్య టీచరో –పేద తండ్రో ఇలా ఆలోచించటం వలన ప్రయోజనమేమిటి? ఆలోచించటం నీవంతు కాదు –ఆచరించటమే నీ విధి. మనసు హెచ్చరించింది.

ఒక గాఢమైన నిట్టూర్పుతో ఆలోచన అణిగిపోయింది.

'మొత్తం పిల్లల సంఖ్య ఎంత?. ఏ తరగతికి ఎందరున్నారు... ఎంతమంది హాజరయ్యారు ఆడపిల్లలెందరు.. మగపిల్లలెందరు.. ఎంతమంది మధ్యాహ్న భోజనం చేశారు. ఏమేమి ఎంతెంత వండించారు...!' ఆదేశాల మేరకు తూనికలు, కొలతలు, లెఖలు సరిచేసుకుని చిట్టాలు తయారుచేసే పనిలో పడింది టీచర్. ■